క్లుప్తంగా

సభను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించే సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు యాదగిరి సంస్మరణ సభను విజయవంతం చేయాలని పార్టీ నాయకుడు ముష్క సుధాకర్ కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కోట గల్లిలో ఉన్న పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. యాదగిరి ఆదర్శ కమ్యూనిస్టు నాయకుడని అన్నారు. సభను పార్టీ కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

సమగ్ర భూ పంపిణీతోనే పేదరిక నిర్మూలన



సమావేశంలో మాట్లాడుతున్న శోభన్

నిజామాబాద్ సిటీ: భూసంస్కరణలు అమలు చేసి పేదలచేతికి భూమి, నీటివసతి కల్పించినప్పుడే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సంఘం రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా శోభన్ మాట్లాడుతూ.. కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులను అమలు చేసి భూమిలేని ప్రతి కుటుంబానికి భూమి ఇవ్వాలన్నారు. 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో బొర్ర సత్యనారాయణ, పెద్ది వెంకట్రాము లు, నాగేశ్వర్ రావు, పల్లపు వెంకటేశ్, సిర్పలింగం, నాగుల గోవర్ధన్, నర్రా శంకర్, ఎస్ సాయిలు, చంద్రకాంత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కరువు



అనూష కుటుంబ సభ్యులతో ఐద్వా నాయకులు

నిజామాబాద్ సిటీ: మహిళలకు రక్షణ లేకుండా పోతోందని, మహిళలను వేధించేవారిని పోలీసులే కాపాడడం దురదృష్టకరమని ఐద్వా నాయకులు పేర్కొన్నారు. ఆదివారం ధర్పల్లి మండలంలో ఆత్మహత్యకు గురైన వివాహిత అనూష కుటుంబాన్ని ఐద్వా జిల్లా నేతలు సుజాత, వనజ పరామర్శించారు. అనూష పిల్లలకు తగిన న్యాయం చేయాలన్నారు. మహిళలపై వేధింపులకు పాల్పడేవారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని కోరారు.


బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీ

జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్ గ్రామానికి చెందిన మాజీ మంత్రి గడ్డం రాజారాం మరదలు గడ్డం గంగాబాగిర్తి ఇటీవల మృతి చెందారు. దీంతో ఆదివారం బాగిర్తి కుటుంబ సభ్యులను ఎంపీ ధర్మపురి అర్వింద్, జాతీయ నాయకుడు యెండల లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ధర్మపురి సంజయ్ వేర్వేరుగా పరామర్శించారు. బాధిత కుటుంబానికి బంధువులు కావడంతో అర్వింద్, సంజయ్ పరామర్శించి ఓదార్చారు. వారి వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, కాంగ్రెస్ నాయకులు అర్గుల్ నర్సయ్య, మేకల రవీందర్, గంగాధర్, ముత్తెన్న ఉన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



ఆలయంలో పూజలు అందుకుంటున్న స్వామివారు

నిజామాబాద్ రూరల్: మండలంలోని మల్కాపూర్(ఎ) గ్రామంలో శ్రీలక్ష్మీ అనంతపద్మనాభ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయంలో ఆదివారం అగ్నిప్రతిష్ఠ, నిత్యహోమం, ధ్వజారోహణం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై ఉన్న శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీ సేవ నిర్వహిస్తామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

వృథాగా ఏబీసీ సెంటర్

- నెలలుగా ఖాళీగా ఉన్న పరిస్థితి
- నగరంలో పెరిగిపోతున్న శునకాలు
- గుంపులు గుంపులుగా దాడులు చేస్తున్న వైనం
- కుక్కల పట్టివేత నిలిపివేత
- రికార్డుల్లోనే కు.ని. ఆపరేషన్లు
- ఏబీసీ సెంటర్ పేరుతో రూ. లక్షల నిధులు పక్కదారి





మాలపల్లిలో కుక్కల దాడిలో గాయపడ్డ చిన్నారులు

నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలో బల్దియా కార్యాలయానికి సమీపంలో ఉన్న యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) సెంటర్ వృథాగా ఉంది. ఇందులో ఒక కుక్క కూడా లేదు. ఆపరేషన్ థియేటర్‌కు సైతం తాళం వేసి ఉంది. శునకాలను బంధించేందుకు సిద్ధంగా ఉన్న కేజ్‌లు(బోన్‌లు) ఖాళీగా ఉన్నాయి. కొన్ని నెలలుగా ఈ ఏబీసీ సెంటర్ వృథాగా ఉంటోంది. ఈ సెంటర్ ముఖ్య ఉద్దేశం వీధి కుక్కలను బంధించి కు.ని. ఆపరేషన్లు చేయడం. కానీ ఆచరణలో మాత్రం అలా జరగడం లేదు. ఫలితంగా నగరవాసులు వీధుల్లో గుంపులు గుంపులుగా తిరుగుతున్న కుక్కలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్పొరేషన్ పరిధిలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వీధి వెంట వెళ్తున్న చిన్నారులు, ప్రజలపై కుక్కలు దాడులు చేస్తున్నాయి. ఇటీవల కుక్కలను నియంత్రించేందుకు, వాటి పునరుత్పత్తిని తగ్గించేందుకు కుటుంబ నియంత్రణ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. మగ కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయాలని ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సాల్మన్‌రాజును ఏబీసీ ఇన్‌చార్జిగా నియమించారు. దీనికి జవాన్‌తో కూడిన ఓ బృందాన్ని ఏర్పాటు చేశారు.

తూతూ మంత్రంగా కు.ని. ఆపరేషన్లు

గతంలో కొన్ని వీధి శునకాలను పట్టుకుని తీసుకొచ్చారు. వాటికి కు.ని ఆపరేషన్లు చేయించి వదిలివేశారు. కొన్ని వీధి శునకాలకు కు.ని. ఆపరేషన్లను తూతూ మంత్రంగా నిర్వహించారు. అధికారులు మాత్రం కొద్దిపాటికి ఆపరేషన్లు చేయగా లెక్కల్లో మాత్రం 400 పైగా కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసినట్లు రికార్డుల్లో రాశారు.



గాయత్రీనగర్‌లో తిరుగుతున్న శునకాలు



ఖాళీగా ఉన్న కేజ్‌లు

నిధుల దుర్వినియోగం

వీధి శునకాలను పట్టుకుని వాటికి ఆపరేషన్లు చేయించేందుకు కౌన్సిల్‌లో రూ.25 లక్షల నిధులు కేటాయించారు. ఆపరేషన్ చేసేందుకు వెటర్నరీ వైద్యుడు, కుక్కలను బంధించేందుకు సిబ్బందికి నిధులు కేటాయించారు. అయితే బల్దియా సిబ్బంది స్థానికులతో కుక్కలు పట్టి ఓ వైద్యుడితో కు.ని.లు చేయించారు. మొదట్లో హడావుడి చేసి తర్వాత వదిలేశారు. రికార్డుల్లో ఒక కుక్కకు కు.ని. ఆపరేషన్ కోసం రూ.1650 బిల్లు వేశారు. ఇలా దాదాపు 400 కుక్కలకు కు.ని చేసినట్లు రికార్డులు రాశారు. ఇప్పటికే కొంత బిల్లులను సైతం చెల్లించారు. మరికొన్ని పెండింగ్‌లో ఉన్నాయి. కుక్కల పేరుతో బల్దియా అధికారులు, సిబ్బంది రూ. లక్షలు స్వాహా చేశారన్నది బహిరంగ రహస్యం. ఇకనైనా మున్సిపల్ కమిషనర్ స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

స్థానికులతో కుక్కలు పట్టి..



వీధి కుక్కల నియంత్రణకు కౌన్సిల్ సమావేశంలో రూ.25 లక్షలు కేటాయించాం. తూతూ మంత్రంగా కు.ని చేశారు. స్థానికులతో కుక్కలు పట్టి, ప్రత్యేక టీమ్ పేరుతో డబ్బులు నొక్కేశారు. సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి.

– గడుగు రోహిత్, మాజీ కార్పొరేటర్

త్వరలోనే ఏబీసీని పునరుద్ధరిస్తాం



ఏబీసీ సెంటర్‌లో ప్రస్తుతం ఎలాంటి కార్యక్రమాలు జరగడం లేదు. కొన్ని నెలలుగా ఖాళీగానే ఉంది. జవాన్, సిబ్బంది కూడా సెంటర్‌లోనే ఉన్నారు. ఏబీసీ సెంటర్‌ను పునరుద్ధరించాలని కమిషనర్ ఆదేశించారు.

– సాల్మన్‌రాజు, శానిటరీ ఎస్‌ఐ, ఏబీసీ ఇన్‌చార్జి

వివరాలు తెలుసుకుంటాం



ఏబీసీ సెంటర్ వృథాగా ఉన్న విషయం వాస్తవమే. కు.ని.పేరుతో నిధుల దుర్వినియోగంపై ఇప్పటి వరకు మాకు ఫిర్యాదు అందలేదు. ఇన్‌చార్జి సాల్మన్‌రాజుకు పూర్తి వివరాలు తెలుసు. ఆయన నుంచి వివరణ తీసుకుంటాం.

– జయకుమార్, ఇన్‌చార్జి ఎంహెచ్‌వో

ఎంపీని కలిసిన గ్రామ కమిటీ సభ్యులు



ఎంపీకి గ్రామ సమస్యలు విన్నవిస్తున్న వీడీసీ సభ్యులు

సిరికొండ: మండలంలోని గడ్కోల్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను జిల్లా కేంద్రంలో ఆదివారం కలిశారు. గ్రామాభివృద్ధి కమిటీకి రెండు గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. గ్రామంలో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ ఏర్పాటు చేయించాలని, గడ్కోల్ కప్పల వాగుపై నిర్మిస్తున్న వంతెన పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని, కామారెడ్డి వెళ్లే మార్గంలో కొండాపూర్ అటవీ ప్రాంతంలో రోడ్డు విస్తరణ చేయించాలని కోరారు. సమస్యలపై ఎంపీ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. బీజేపీ బీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామస్వామి, వీడీసీ చైర్మన్ రవీందర్‌గౌడ్, గొల్ల శ్రీనివాస్, దడిగె బాలకిషన్, గాండ్ల నరేందర్ ఉన్నారు.

అలరించిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్



తయారు చేసిన ప్రదర్శనలతో విద్యార్థులు

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న అభ్యాస స్కూల్‌లో ఆదివారం ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. నర్సరీ నుంచి ఏడో తరగతి వరకు పిల్లలు తమ సృజనాత్మకతతో 'వేస్ట్ టు బెస్ట్' అనే నినాదంతో 900 ఐటమ్స్ ను సిద్ధం చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ చంద్రమోహన్ ప్రారంభించి సందర్శించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ చెన్న అన్నపూర్ణ, డైరెక్టర్లు పి శ్రీనివాస్, కె శ్రీకాంత్, ప్రిన్సిపాల్ సీహెచ్ మాధవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నగర మహాసభలు ప్రారంభం



జెండావిష్కరణ చేస్తున్న నాయకులు

నిజామాబాద్‌అర్బన్: ఎస్ఎఫ్ఐ 16వ నగర మహాసభలు ఆదివారం నాందేవ్‌వాడలో ఉన్న మల్లు స్వరాజ్యం ట్రస్ట్ భవనంలో జరిగాయి. కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు శోభన్ హాజరై మాట్లాడారు. 1970లో ఎస్ఎఫ్ఐ ఏర్పాటైందని నాటి నుంచి విద్యారంగ సమస్యలపై అనేక పోరాటాలు చేస్తోందని అన్నారు. అనంతరం నాయకులు జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో సిర్పలింగం, దినేశ్, చక్రి, ఆజాద్, రాజు, వినీత్, నవదీప్, రాణి, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి అండ

రెంజల్(బోధన్): తమతో కలిసి చదువుకున్న స్నేహితుడు అనారోగ్యంతో మృతిచెందడంతో మిత్రుని కుటుంబానికి అండగా నిలిచాడు. ఆదివారం రెంజల్ హైస్కూల్‌లో 2001–02 పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుపుకున్నారు. తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన గాండ్ల బాలకృష్ణ అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వ్యాపారి రవీందర్ స్నేహితుడి భార్యకు రూ.30 వేల నగదును అందించారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	89,300	వెండి(కిలో)	1,01,000
22 క్యారెట్స్	82,230		– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	120
స్కిన్‌లెస్	220	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	12	గాజరుగడ్డ	30	50
బెండకాయ	40	80	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	50	80	దోసకాయ	30	50
దొండకాయ	30	50	ఆలుగడ్డ	20	40
బీర్నిసుకాయ	40	60	గోబిగడ్డ	10	20
కాకరకాయ	30	50	గోబిపువ్వు	20	40
వంకాయ	10	20	బీట్‌రూట్	30	50
పాలకూర	10	20	కరివేపాకు	60	110
మెంతికూర	15	30	చామగడ్డ	40	80
కొత్తిమీర	10	20	గోరుచిక్కుడు	40	80
పుదీనా	40	80	చిక్కుడుకాయ	30	60
క్యాప్సికం	40	60			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

- స్క్రీన్-1 ఛావా(హిందీ)- 11.00, 1.40, 10.20; తండేల్(తెలుగు)-4.35, 7.30
- స్క్రీన్-2 లైలా(తెలుగు)-11.00,1.40,7.20, 10.20; ఛావా(హిందీ)-4.30
- స్క్రీన్-3 బ్రహ్మ ఆనందం(తెలుగు)-11.00, 4.30; ఆరెంజ్(తెలుగు)- 1.40; కెప్టెన్ అమెరికా(తెలుగు)-4.30; తండేల్(తెలుగు)- 10.25

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1 కెప్టెన్ అమెరికా(తెలుగు)-10.45, 7.20; లైలా(తెలుగు)-1.25; తండేల్(తెలుగు)-4.15, 10.00
- స్క్రీన్-2 ఛావా(హిందీ)-10.00, 4.00, 10.25; కెప్టెన్ అమెరికా(3డీ తెలుగు)-1.20; తండేల్(తెలుగు)-7.25
- స్క్రీన్-3 తండేల్(తెలుగు)-10.30; నిదురించు జహాపన(తెలుగు)-1.35; లైలా(తెలుగు)-4.10; ఛావా(హిందీ)-7.00; సనమ్ తేరి కసమ్(హిందీ)-10.20
- స్క్రీన్-4 తల(తెలుగు)-10.55; సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)-1.35, 7.40 - బ్రహ్మ ఆనందం(తెలుగు)-4.35; లైలా(తెలుగు)-10.40

- లలితామహల్ తండేల్(తెలుగు)
- దేవి లైలా (తెలుగు)
- నటరాజ్ ఛావా(హిందీ)
- విజయ్ సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)

యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రతిభా పరీక్ష



ప్రశ్నాపత్రం విడుదల చేస్తున్న నిర్వాహకులు, కాకతీయ విద్యాసంస్థల కరస్పాండెంట్ రజనీకాంత్

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని కాకతీయ పాఠశాలలో యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి ప్రముఖ సీనియర్ న్యాయవాది రాజేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థులు రానున్న పదో తరగతి పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. కార్యక్రమంలో కాకతీయ విద్యాసంస్థల కరస్పాండెంట్ రజనీకాంత్, పెద్ది సూరి, సిద్ధాల నాగరాజు, మహేశ్, గణేశ్, వేణు, మారుతి, వైష్ణవి, దుర్గా, బాబురావు సాయి, విశాల్, కిరణ్, నవీన్, క్రిష్, మహేందర్, సంతోష్, నిశాంత్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ శిక్షణ తరగతుల్లో విపుల్‌గౌడ్



తరగతుల్లో పాల్గొన్న విపుల్‌గౌడ్

నిజామాబాద్ సిటీ: కొత్తగా ఎన్నుకోబడిన యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గసభ్యులు, జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ అధ్యక్షులకు రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. మూడు రోజులపాటు హైదరాబాద్‌లోని శంషాబాద్‌లో ఈ రాజకీయ శిక్షణ తరగతులు చేపట్టారు. ఈ శిక్షణ తరగతుల్లో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్‌గౌడ్‌తో పాటు రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరాల నిహార్, రూరల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఆశల మహీందర్ ఉన్నారు.

ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించాలి

ఆర్మూర్‌టౌన్ : రొడ్డ రాజన్న ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించాలని డీటీఎఫ్ రాష్ట్ర మాజీ నాయకుడు లచ్చయ్య అన్నారు. పట్టణంలోని సిద్ధార్థ జూనియర్ కాలేజీలో డీటీఎఫ్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి రొడ్డ రాజన్న సంస్మరణ సభ నిర్వహించారు. డీటీఎఫ్ రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువతలో పెరుగుతున్న భక్తిభావం

- ఉత్సాహం చూపుతున్న యువకులు
- మాలధారణతో ప్రశాంత జీవనం



కొత్తపల్లిలో పూజలు చేస్తున్న శివ స్వాములు

బాల్కొండ: యువతలో ఆధ్యాత్మికతపై ఆసక్తి పెరుగుతోంది. శివరాత్రి పర్వదినానికి ముందు 41 రోజులపాటు శివమాల ధరించి దీక్షతో పూజలు చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శివ భక్తులు మాలధారణ ధరిస్తున్నారు. నిత్యం శివనామ స్మరణలో తరిస్తున్నారు. ముప్కాల్ మండల కేంద్రంలో పడి లేచిన మాయల మర్రిచెట్టు వద్ద, వేంపల్లి శివాలయం వద్ద, కొత్తపల్లిలో రాజరాజేశ్వర ఆలయం వద్ద, వెల్కటూర్‌లో పార్వతి రాజరాజేశ్వర ఆలయం వద్ద భక్తులు శివ మాల ధరించారు.

18 సార్లు మాల వేసుకున్నా



నేను ఇప్పటి వరకు 18 సార్లు శివమాల వేసుకున్నాను. మాలధారణ చేపట్టినప్పుడు చాలా ఆనందంగా ఉంటుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. మాల ధరించడం అదృష్టంగా భావిస్తున్నా.

–జైడి వెంకట్‌రెడ్డి, భక్తుడు

ఆధ్యాత్మికంగా గడపడం అలవాటు చేసుకున్నా



శివ మాల ధరించడంతో మంచి అలవాట్లు నేర్చుకుంటున్నా. ఉదయం లేవగానే తల స్నానం చేసి నిత్యం పూజ నిర్వహించే అలవాటు వచ్చింది. ఆధ్యాత్మికంగా రోజూ గడపడం అలవాటు చేసుకున్నా.

–సుందర్, భక్తుడు

నిరుద్యోగులను మోసం చేసిన ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్‌కుమార్

నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తోందని నిరుద్యోగ హక్కుల నేత, అశోక అకాడమీ డైరెక్టర్ అశోక్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఎస్పీ బలపర్చిన అభ్యర్థి ప్రసన్న హరికృష్ణను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గంగాధర్, ప్రవీణ్ రాజ్, నాగరాజు ప్రణీత్, రంజిత్ పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



పూజలు నిర్వహిస్తున్న పండితులు

మాక్లూర్: మండలంలోని అడవి మామిడిపల్లి శివారులో అపురూప వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి కల్యాణాన్ని అర్చకులు వైభవంగా జరిపారు. ఆనవాయితీ మేరకు గ్రామస్తులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ ట్రస్ట్ చైర్ పర్సన్ అమృతలత, ఆలయ కమిటీ సభ్యులు నరేందర్‌రెడ్డి, రమా, ప్రభదేవి, ప్రభావతి, సురేందర్‌రెడ్డి, గ్రామ పెద్దలు డీసీ గంగారాం, కె ప్రదీప్, గంగోనే సంతోష్, చింత మల్లారెడ్డి, రాజు, బండారి రాములు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



సమావేశంలో మాట్లాడుతున్న తిరుమలరెడ్డి

నిజామాబాద్ నాగారం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ అభ్యర్థి తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి కోరారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో తనను గెలిపిస్తే తప్పకుండా సీపీఎస్ పాత పెన్షన్ విధాన పునరుద్ధరణకు పాటుపడతానని అన్నారు. తప్పకుండా నిరుద్యోగ, ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని పేర్కొన్నారు.